


రావి కొండలరావు

క్రిక్కిరిసిపోయిన ఒకానొక రైలుపెట్టెలో కిందామీదా జనం కూచుని వున్నారు. కూచోగా ఒకడిని ఆనుకొని ఒకడు నిలుచుని వున్నారు. నించోగా సీట్లక్రింద కాళ్లు బార జాపుకుని ఇద్దరు ముగ్గురు నిద్రపోతూ కలలు కూడా కంటున్నారు! ఆ స్టేషన్లో బండి ఆగి అరగంట దాటింది. ఇప్పట్లో అది కదిలే సూచన లేవీ కనిపించటంలేదు. ఇంతమందితో క్రిక్కిరిసిగావున్న ఆ పెట్టెలో తనకుకూడా వేరేచోటు ఎక్కడని, వాయు దేవుడు ఆ ప్రాంతాలకే రావటం మానేశాడు!

"అమ్మమ్మమ్మో-నా చెయ్యి నా చెయ్యి" అన్నాడొక ప్రయాణీకుడు వున్నట్టుండి ఏ మూలనుంచో.

"నా కాలు నా కాలు" అన్నాడు మరొకడు మరోమూలనుంచి.

"రైలు ప్రయాణం అంటే నరకం ఐపోయిందిరా బాబూ" అని ఒక గొంతు.

"కాస్త సర్దుకోండి" అని మరోకంఠం.

"ఎక్కడ, ఎక్కడ సర్దుకోమని తమ సెలవు?" అన్నాడు ఆ స్టేషన్లో బండెక్కిన శేషగిరి. అంటూనే కాస్త వెనక్కు తిగేసరికి 'అమ్మో' అన్నాడో కుర్రాడు కాళ్లకింద.

"నీ దుంపతెగ - కాళ్లకింద కూచున్నావేం?" అన్నాడు శేషగిరి తప్పంతా వాడిదేనని పెట్టెలోవాళ్లంతా భావించేట్టు. అంతతో వూరుకోకుండా రెండుచేతులూ పైకి విసిరాడు. ఆ విసరటంలో అతని కుడిచెయ్యి - పైని కూచుని క్రిందకి వింతలుచూస్తున్న వాడి గడ్డానికి కొట్టుకొంది. 'కుంయో' మన్నాడు వాడు. ఒకడు 'బోయ్' మని ఆపులించాడు, ఒకడు "ఛీఛీ"మని దగ్గాడు. నలుగురు దమ్ములుకొడుతున్నారు... ఇద్దరు గురకలు పెడుతున్నారు...ఈ వాతావరణం శేషగిరికి దుర్భర మనిపించింది. మదరాసు చేరుకునేవరకూ తను ఇట్లా ఈ నరకంలో గడపాల్సిందేనా! రామ రామ! నరకం ఇంతకంటే బాగానయం. అక్కడ కూచోటానికి చోటయినా వుంటుంది.

ఎవడినో ఉద్ధరించినట్టు బండి కదిలింది. 'అమ్మయ్య' అన్నారు ప్రయాణీకులంతా 'కోరస్'లో. శేషగిరి బండి కుదుపుతో వెనక్కు పడ్డాడు. పు..టం కొంతవరకు లభించింది. తెంతే ఖాళ్లగింపలో పడ్డవాడల్లే

శేషగిరి కిటికీ దగ్గరగా పడ్డాడు. వున్నంతలో విశాలంగా వున్నట్టు కనిపించింది...

"ఏవూరండీ?" అన్నాడొక ప్రయాణీకుడు శేషగిరిని వుద్దేశించి - ఆ సందులోనే.

"మద్రాసు. మీరు చూసే ఈ సినిమాలన్నీ మావూళ్లోనే తీస్తారు" అన్నాడు శేషగిరి గొప్పగా. ఈ వాక్యం ముగిసేలోపుగానే, శేషగిరికి ఎనమండుగురు ప్రయాణీకులఅవతలగా ఒంటికాలుమీద నించునివున్న ఒక యువప్రయాణీకుడు, ఇంతమందినీ తోసుకుంటూ, ఈగుకుంటూ శేషగిరి దగ్గర పడి అతనిచుట్టూ మూగాడు!

"మీది నిజంగానే మద్రాసుటండీ?" అన్నాడాయువకుడు.

"అవును"

మరోజనం శేషగిరికి ఇంకోపక్కగా మూగాడు...

పదిహేనునిమిషాల్లో శేషగిరికి బెంచీమీద కూచునేందుకు చోటు దొరికింది. అతన్ని వూపిరిపీల్చుకోనివ్వకుండా చుట్టుముట్టి, ప్రశ్నలడిగేస్తున్నారు ప్రయాణీకులు.

"షూటింగులు చూశారా?' 'వాహినీలో ఫ్లోరెన్ని?' 'రేలంగి ఇవతలకూడా అలాగే వుంటాట్ట!"—ఇటువంటివే లక్షలు.

అన్నిటికీ శేషగిరి వీలైనంతమట్టుకు జవాబులు చెబుతున్నాడు. శేషగిరిది మదరాసు కాకపోయినా, ఒకసారి చూసివచ్చాడు గనక—వీళ్ళ సందేహాలకు సమాధానాలివ్వగలిగాడు.

ఆ పెట్టెలో శేషగిరి, నాలుగైదు రాజ్యాల్ని పరిపాలించే మహారాజైపోయాడు. అతనిమాటలలో అంత ధీమా, కూచోటంలో అంతపోజూ, తలతిప్పుతూ చేతులు ఎగరెయ్యటంలో అంత దర్జా—అన్నీ కనిపిస్తున్నై...

కొన్ని స్టేషన్లు దాటినతర్వాత, కొంతమంది ప్రయాణీకులు దిగిపోయినతర్వాత శేషగిరికి పైన పడుక్కునే 'ఛాన్సు' తగిలింది. రెండుకాళ్లూ బారజాపుకుని పడుకుని సిగరెట్టుపీలుస్తూ తనెంత తెలివిగా ప్రవర్తించి ఈ సీటు సంపాయించుకున్నాడో వూహించుకుని పొంగిపోయాడు. ఈ 'తెలివి' కంటె తెలివయినపని మరొకటి చేస్తున్నందుకు సముద్రం పొంగినట్టు ఇంకా పొంగిపోయాడు శేషగిరి.

నిజానికి శేషగిరిది ఆంధ్రదేశంలో 'పట్నం' అనబడే ఒక పల్లెటూరికంటే కాస్తనయం అయినగ్రామం. అక్కడే శేషగిరికి ఉద్యోగం. ఈ మధ్య శేషగిరి మిత్రుడొకడు అకస్మాత్తుగా చనిపోయాడు. తన ఈడువాడు, సాటివాడు — వున్నట్టుండి - రెండురోజుల జ్వరంవల్ల చనిపోవటం అందరికీ ఆశ్చర్యం కలిగించింది. అవాళ శేషగిరి వాళ్లింటికి వెళ్ళాడు. మిత్రులంతా వచ్చారు. చనిపోయిన ఆ మిత్రుడి బంధువులంతా గోలుగోలున ఏడుస్తున్నారు. అతని తల్లీ, భార్యా-పిల్లలూ అంతా పాపం ఎంతగా ఏడుస్తున్నారో చూస్తే చూసినవారి గుండెలు తరుక్కుపోయినై. అతను ఎంతమంచివాడో ఎంత కరకట్టుమనిషో — ఎంత సామ్యవంతుడో మొదలైనవన్నీ మిత్రులంతా మాట్లాడుకున్నారు. వాళ్ళకుటుంబానికి ఏవిధంగానైనా సహాయపడాలని నిశ్చయించుకున్నారుకూడా. ఆ రాత్రి శేషగిరి ఇంటికివెళ్లి పక్కమీద పడుకుంటే ఎంతకూ నిద్ర రాలేదు. అతని ఆలోచనలన్నీ చనిపోయిన ఆ మిత్రుడిమీదికే పోయినై. నిజంగానే పాపం దురదృష్టవంతుడు! సరదాగా తమాషాగా వుండేవాడు. ఇంతచిన్న వయస్సులోనే అతన్ని మృత్యువు మింగేస్తుందని ఎవడైనా కల్లోనన్నా వూహించాడా! పాపం పిల్లలు చిన్నవాళ్లు! ఎంతమంది ఓదార్చినా వాళ్ళ దుఃఖం తగ్గటంలేదు. అనుకుంటాముగాని, ఎట్లా వూరుకోగలరు ఎవరు మాత్రం! అవాళ మధ్యాన్నం ఆఫీసుకు సెలవుకూడా ఇచ్చారు. ఆఫీసులో అందరూ అతన్నిగురించేమాట్లాడుకున్నారు. బ్రతికున్నరోజుల్లో అతనంటే కిట్టనివాళ్లుసైతం చనిపోయాడని తెలిసి విచారించారు!

ఈ ఆలోచనల్లోంచి పోనుపోను శేషగిరికి ఇంకేవేవో ఆలోచనలు కలగసాగినై. శ్మశానవైరాగ్యంకూడా కలిగింది. అందరూ ఇంతేకదా! పుట్టిన ప్రతివాడూ గిట్టాల్సిందేకదా! ఏనాడో తనూ చావాల్సినవాడే. తన కుటుంబమూ ఈ విధంగానే దిక్కులేనిదైపోవాల్సిందే!... శేషగిరికి గుండె గుభేల్మన్నది. తనుకూడా చావాలన్నమాట. తన కుటుంబమూ మిత్రబృందమూ అంతా ఇదేవిధంగా విచారిస్తారన్నమాట! తన గొప్పతనం అంతా ఆరోజు బయటపడుతుందన్నమాట. తను చస్తె తనగురించి ఇంతగా ఏడుస్తారా తన భార్యా-బిడ్డలూ అంతా! శేషగిరికి నవ్వులాంటిదొచ్చింది. ఛా! ఇదేం అనుమానం!... తను చస్తె ఏడ్చేవాళ్లు ఈ లోకంలో చాలామంది వున్నారు. తన మిత్రులంతా ఏడుస్తారు. దూరదూరంగావున్న మిగతామిత్రులకుకూడా తన 'మరణవార్త' తెలుస్తుందా? వెంటనే తెలియకపోయినా కొన్నాళ్ళకన్నా తెలుస్తుంది. తను చాలా గొప్పవాడైతే తను చనిపోయినట్టు వార్తాపత్రికల్లో పడుతుంది. అదిచూసి వాళ్లు తెలుసుకోవచ్చును. ఐతే తన మరణవార్త వార్తాపత్రికల్లో పడేటంతటి గొప్పవాడు కాదు తను! కాని, ఒకటున్నది. తనుగానీ ఎవరిచాతనన్నా హత్యచేయబడినా, తను ఆత్మహత్య చేసుకున్నా తను చచ్చిపోయినట్టు పేపర్లో పడుతుంది. తను ఆత్మహత్య చేసుకోవాలన్నమాట ఐతే!...ఎందుకూ చేతుకోవటం! పైగా తను ఎన్ని సంవత్సరాలు బ్రతుకుతాడో ఎవడికి తెలుసు! కనీసం ఎనభై ఏళ్ళయినా బ్రతికి వుండాలని తన ఆశ! ఎనభైఏళ్లు బ్రతికేశాక ఆత్మహత్య చేసుకోవచ్చు. లేదా అప్పుడు తనను ఎవడన్నా వచ్చి 'హత్య' చేయవచ్చును! అట్లా హత్య చేయించుకోవాలంటే తనకు శత్రువుండాలి ...ఐనా ఇన్ని సంవత్సరాలు ఇంకా ముందు వుంటూవుంటే ఈలోగా ఏవయినా గొప్ప గొప్ప కార్యాలుచేసి గొప్పవాడినే కావచ్చుగా. శేషగిరి ఇంకా ఇంకా ఆలోచించాడు...ఇంకా ఇంకా ఆలోచించాడు ...ఎంతయితేనేం - ఏమైతేనేం - తను చనిపోతే తనగురించి అందరూ ఎట్లా విలపిస్తారో తను చూడలేదు గదా! తనే అనేమిటి - ఎవడూ చూడలేడు. చూడగలిగితే?... అదృష్టవంతుడే! 'చూడగలగడం' ఎట్లా?... ఆ 'ముచ్చట' చూడాలని తనకున్నది. శేషగిరికి 'తక్షః'మని ఎవరూ వూహించరాని, ఎవరికీ ఎన్నడూ కలగని విపరీతమైన వూహ ఒకటి కలిగింది. తను చచ్చిపోయినట్టు నటిస్తే?—

శేషగిరి దిగ్గున లేచికూచున్నాడు. ఇది చాలా చక్కగా వున్నది. అప్పుడు తన గొప్పతనం అంతా తనే వినొచ్చు. తన మిగతా మిత్రులంతా తనను ఎంతగా పొగుడుతారో

## మెజారిటీ

జార్జి బెర్నార్డ్‌షా నాటకం ఒకటి ప్రదర్శిస్తున్నారు. ఆ నాటకంలో చాలానే పాత్రలు ఉన్నాయి. ప్రదర్శనం మొదటి రోజున ప్రేక్షకులు లేరు. మరునాడు ప్రదర్శన ప్రారంభానికిముందు ఒకనటి ఆదుర్దాగా తెరసందునుంచి హాలులోకి చూస్తూ ఉంది.

షా ఆమెవద్దకు వెళ్ళి "ఎంతమంది వచ్చారు" అని అడిగాడు.

"నిన్నటికన్నా కాస్త నయం" 'అన్నది ఆ నటి.

షా కూడా హాలులోనికి చూచి "అయినా ఇంకా మనదే మెజారిటీ!" అన్నాడు.

ఎమ్. వి. శివకుమార్ (చెరుకుపల్లి).

# దిదృక్ష


తెలుసుకో వచ్చును. అప్పుడే నిజమైన మిత్రులెవరో, దొంగలెవరో కూడా తెలిసిపోతుంది. ఆ ఆఫీసరు కూడా విచారిస్తాడు. విచారించి తీరాలి! ఇట్లా అందరూ విచారంలోపడి తను బ్రతికి వుంటే ఇంకా ఎన్నెన్ని ఘనకార్యాలు చేసేవాడో చెప్పుకుంటూ వుంటే – తను ఒక్కసారిగా 'ఢాం' లేచి కూచోవాలి. అప్పుడు మిగతా వాళ్ళంతా స్తంభించుకుపోయి, సంతోషంతో తెప్పరిల్లి తనను కావలించుకుంటారు. తన భార్య ఒక్కసారి సావిత్రి అంత గొప్పదైనట్లు భావించుకుంటుంది. అప్పటి సంతోషం ఆనందం ఎట్లా వుంటాయో వూహించటానికి కూడా వీల్లేదు. ఈ నాటకం ఆడి చూడాలనుకున్న శేషగిరికి 'అందరూ నమ్ముతారా' అనే సందేహం కలిగింది. నమ్మకేం జేస్తారు? ఇటువంటి విషయాల్లో సాధారణంగా ఎవడూ నాటకం ఆడడు. కాని ఒక చిక్కున్నది. ఏ జబ్బూ జ్వరమూ లేకుండా తను ఎట్లా చావటం? – ఒకవేళ ఏదో గుండెల్లో వున్నట్టుండి నొప్పి కలిగినట్టు నటించి, చచ్చిపోయినట్టు పడిపోతే? – ఇదీ అంత సులభమైనది కాదు. ఆ సమయంలో ఎవరన్నా తన గుండెమీద చెయ్యివేసి చూశాడంటే, నిజంగా గుండె ఆగిపోతుంది! కాకయినా, అంతసేపు వూపిరి స్తంభించి, శవమల్లే పడుకోటం మాటలు కాదు. ఇంకెట్లా నాటకం ఆడాలోనని శేషగిరి చాలా ఆలోచించాడు. ఆఖరికి దివ్యమైన వూహ ఒకటి కలిగింది. తను ఏదో వూరుకు వెళ్ళిపోయి అక్కడ తను అకస్మాత్తుగా చచ్చిపోయినట్టుగా ఎవరిచాతో టెలిగ్రాం ఇప్పించి, తను మారువేషంలో దొంగతనంగా ఇల్లు చేరుకుని – వ్యవహారాన్నంతా చాటుగా చూడవచ్చును. తను చనిపోయాడనే వైరు రాగానే తన భార్య... శేషగిరికి కళ్ళు చెమ్మగిల్లాయి. పాపం! ఒఖసారి మూర్ఛపోయి ఏడుస్తుంది ...కాని అంతలోనె తను ఎదుటబడితే ఎంత సంతోషిస్తుంది!... ఈ వెధవలంతా వస్తారు. తననుగురించి మాట్లాడుకుంటారు. ఆఫీసు ఒకపూట మూస్తారు కూడాను. ఇదంతా తలచుకుంటూ వుంటే శేషగిరికి ఆనందం ఆగలేదు. 'భేష్' అనుకున్నాడు. ఏనాడూ ఎవడూ ఆడని మహత్తర నాటకం తను ఆడబోతున్నాడు!...

ఈ ఉద్దేశంమీదనే శేషగిరి ఆఫీసుకు నాలుగు రోజులు సెలవు పెట్టి పనిమీద మద్రాసు వెళ్తున్నట్టు భార్యతో చెప్పి రైలెక్కాడు. ఎక్కుతూనే తను ఏంచేసినా దివ్యంగా ఫలిస్తుందనటానికి తార్కాణంగా చిన్న నాటకం ఆడి చక్కని సీటు సంపాయించుకున్నాడు. తను మద్రాసు చేరుకుని, రెండు రోజులు పోయాక ఎవరో మిత్రుడిస్తున్నట్టుగా ఒక "వైరు" సృష్టించి ఇంటికి పంపాలి. దాని వెనకనే తనూ ఇల్లు చేరుకోవాలి!

అనుకున్నట్టుగా శేషగిరి మద్రాసు చేరుకున్నాడు. హోటలుగదిలో మకాంపెట్టి వూరంతా తిరిగాడు. ఎరిగున్న పాత స్నేహితుడొకడుంటే కలుసుకున్నాడు. ఇద్దరూ కలిసి తిరిగారు. మూడోనాడు, తన వూరుకు బయల్దేరే బండికి తను సిద్ధమై స్టేషను చేరుకుని–స్టేషన్ నుంచే ఇంటికి వైరు చేశాడు—"అకస్మాత్తుగా మీ శేషగిరి ప్రమాదంవల్ల మరణించినట్టు తెలియజేయడానికి విచారిస్తున్నాను. వివరాలు ఉత్తరం రాస్తున్నాను"—మిత్రుడు.

ఈ వైరు వెళ్ళిపోయింది! శేషగిరి రైలుపెట్టెలో కూలబడి సిగరెట్టు కాల్చుకున్నాడు. ఇంక కొన్ని గంటల్లో ఈ వైరు ఇంటికి జేరుతుంది. 'టెలిగ్రాం' అంటేనే తన భార్యకు పాపం, ఎక్కడలేని భయమూనూ. అట్లా భయపడుతూనే ఈ వైరు పుచ్చుకుని చూస్తుంది. అంతే! సొమ్మసిల్లి పడిపోతుంది. పిల్లలంతా 'అమ్మా నాన్న నాన్న' అని ఏడుస్తారు. కాస్సేపట్లో తను చచ్చిపోయినట్టు ఊరంతా తెలిసిపోతుంది. శేషగిరి ఇవన్నీ వూహించుకున్నాడు. మధ్యలో అతనికి ఏడుపు వచ్చింది. ఛా— ఈ నాటకం ఎందుకాడుతున్నట్టు తనూ అని కూడా అనిపించింది. ఇందువల్ల ఏం ప్రయోజనం? ఆ, ప్రయోజనం ఏముంది! చిన్న తమాషా. తను చచ్చిపోయిన తర్వాత అందరూ ఎట్లా ఏడుస్తారో చూడవచ్చునుగా! ఎవరూ చూడని, చూడలేని ఒక వింతయిన విశేషం తను కాబట్టి చూడబోతున్నాడు. సమయం చూసి తను ఎదుటపడాలి —వాళ్ళంతా నిర్ఘాంతపోయి 'నువ్వు చచ్చిపోలేదూ' అంటారు. 'నేను చచ్చిపోవటమా' అని తను ఆశ్చర్యపడతాడు. భార్య ఆ వైరు చూపిస్తుంది. కాస్సేపు తనూ నిర్ఘాంతపోయి, "హుం, కిట్టనివాళ్ళిచ్చిన వైరు" అని తేలుస్తాడు. ఇట్లా ఐతే ఈ నాటకం అంతా తను ఆడినట్టు ఏకోశానా ఎవడూ అనుమానించలేడు. ఆ 'కిట్టనివాడిని' అంతా తిట్టి దిగపోరబోయొచ్చు. అందువల్ల —ఇట్లా నాటకం ఆడినందువల్ల—తనకేం నష్టంలేదు సరికదా—కిట్టని వాళ్ళెవరో తననిట్లా చేసినందుకు అందరిదగ్గరా సానుభూతి కూడా పొందుతాడు. శేషగిరి గుండె దిటవు చేసుకున్నాడు!

తనవూరుకు ఇవతలి స్టేషను చేరుకునేటప్పటికి రాత్రయింది. ఆ స్టేషన్‌లో బండి ఆగటమే తడవుగా శేషగిరి ఏదో ఆలోచన తట్టి, చటుక్కున సంచీ తీసుకుని దిగిపోయాడు. అమ్మయ్య! సమయానికి బుద్ధి మహా చక్కగా పనిచేసింది. లేకపోతే తన వూళ్ళోనే గాని తను దిగితే తన మరణవార్త విన్న ఏ స్నేహితుడి కంటనన్నా పొరపాటునగాని తను పడితే ఇంకేమన్నా వుందా? అందుకనే శేషగిరి ముందు స్టేషన్‌లోకి దిగి జాగ్రత్త పడ్డాడు! శేషగిరి నెమ్మదిగా ఆ వూళ్ళోకి నడిచాడు. ఆ వూళ్ళో తనను ఎరిగున్న వాళ్ళు ఎక్కడో వుంటే ఒకడుంటాడు! ఒకవేళ వాడు తనను పలకరించినా అట్టే ఏం ఇబ్బందిలేదు. ఎంచాతంటే తను చచ్చిపోయినట్టు అప్పుడే వీడికి తెలిసే అవకాశం లేదు!



"అంతరిక్షంలోకి వెళ్ళి త్వరగా తిరిగి రావాలి సుమా!"

చిత్రకారుడు— శ్రీ ఎగ్గోని శ్యామసుందర్, (సత్తి)

---

ఒక పెద్దమనిషి హోటల్లోకి వచ్చి కూర్చుని, బాగా మాడిపోయిన అట్టూ, చక్కెర ఎక్కువ వేసి చల్లబడిపోయిన కాఫీ తెమ్మన్నాడు. మొదట్లో ఆశ్చర్యపోయినా, అతను పట్టుబట్టడంచేత సర్వర్ విధిలేక అతను చెప్పినట్లే పదార్థాలను తయారు చేయించి తీసుకు వచ్చాడు. "చాలా? ఇంకా ఏమైనా కావాలా?" అన్నాడు వ్యంగ్యంగా.

"ఇంకేమీ అక్కర్లేదు కాని, నా పక్కన కూర్చుని సాధించు. అచ్చం ఇంట్లో తిన్నట్టే ఉంటుం"దని కోరాడు ఆ పెద్దమనిషి.

—ఎస్. ఆర్.

ఆ వూళ్లో చిన్న హోటలుంటే అక్కడ సంచీపెట్టి భోజనం చేశాడు శేషగిరి. ఈ రాత్రి వేళ రహస్యంగా తనవూరు చేరుకోవాలి. వూరు చేరటంతో సరికాదు—తన ఇల్లూ చేరుకోవాలి. చేరుకోవటం అంటే రహస్యంగా తను అంతా గమనించేందుకు అనువైనచోటు ఒకటి చూసుకోవాలి. ఇదంతా సమస్యగానే కనిపించింది శేషగిరికి.

సుమారు తొమ్మిది గంటలవేళ శేషగిరి పల్లెటూరి వాడిల్లే వేషం వేసుకుని—తలకొక పాగా కూడా చుట్టుకుని హోటలు గుమ్మం దాటి బయటకొచ్చాడు. అక్కడికి తనవూరు నాలుగు మైళ్ళు. నడిచి వెళ్ళటం అంటే సాధ్యం కాని విషయం. ఈ వేళప్పుడు బస్సులు దొరకవు. దొరికినా బస్సు అనవసరం. అందులో తనకు తెలిసిన మొహాలు కనిపించవచ్చును. కాకపోయినా, బహిరంగంగా అందరికీ తను కనిపించాల్సివస్తుంది—'సందు'లో నన్నా. ఇట్లా వూహిస్తూనే శేషగిరి నెమ్మదిగా నడవసాగాడు. అతనికి ఒక జట్కా కనిపించింది. శేషగిరి జట్కా వాడి ముఖాన్ని పరికించి చూశాడు—ఎరిగి ఉన్న ముఖం కాదది!

"జట్కా!" అన్నాడు శేషగిరి.

జట్కావాడు ఆశగా వొచ్చి, శేషగిరి వేషం చూసి—ఇది బేరం పడని వ్యవహారం అనుకుని—"ఎక్కడికెల్లాల?" అన్నాడు నిర్లక్ష్యంగా. శేషగిరికి మండిపోయింది. 'ఎవడి ననుకున్నావురా నాజవాబ్—ఇష్టం వచ్చినట్టు పేల్తున్నావ్?' అందామనుకున్నాడు. కాని అంతలోనే తన వేషం గుర్తుకొచ్చి మాటకూడా మార్చాలని గుర్తొచ్చింది. శేషగిరి తన వూరు పేరు చెప్పి అక్కడికి పోవాలన్నాడు. జట్కావాడూ అతనూ కొంతసేపు బేరమాడుకున్నాక శేషగిరి జట్కా బండి ఎక్కి, హత్య చేసిన వాడికంటే కూడా ఎక్కువ నేరం చేసినవాడల్లే భయపడుతూ—ఒకమూల వొదిగి కూచున్నాడు. జట్కా బండి బయల్దేరాక కూడా శేషగిరికి అనేక సందేహాలు కలిగినె. తను సరాసరి ఎక్కడికి పోవడం? వూళ్లో ఎక్కడో దిగిపోయి తన ఇంటికి నడుచుకొని పోవడమా? కాకపోతే సరాసరి తనయింటికే పోవడమా?—ఈ రెండోది అపాయకరమైనది. ఒకవేళ—వీధి మొదట్లో దిగేసి నెమ్మదిగా నడిచిపోతే? ఏమో, ఎవరు చూస్తారో, ఏం జరుగుతుందో! ఈ లోపల ఎట్లావున్నా తన వీధి ప్రాంతాల మాత్రం తాను చాలా మెళకువగా ఉండాలి.

ఊరు చేరుకుంటున్న కొద్దీ శేషగిరి గుండె ఎక్కువగా కొట్టుకోసాగింది. జట్కావాడు గుర్రాన్ని అదలిస్తూ ఉషారుగా తోలుతున్నాడు. బండి వూళ్లో ప్రవేశించింది. ఎలెక్ట్రిక్ దీపాల వెల్తుర్లో మనుషులు కన్పిస్తు

# జాన్ ఫిట్ జిరాల్డ్ కెన్నెడీ



రాజకీయాలలో అడుగుపెట్టిన నాటినుంచీ దేశంలోకెల్లా గొప్ప పదవి, మహా అధికారం కలిగినది, అమెరికా అధ్యక్ష పదవి ఆక్రమించాలని కోరుకొన్నాడు జాన్ ఫిట్ జిరాల్డ్ కెన్నెడీ. కాంగ్రెసు సభ్యత్వం సంపాదించారు. తొలి మెట్టు అధిరోహించాడు. అకుంఠితమైన దీక్షతో ఏకాగ్రమైన లక్ష్యంతో కృషి చేశాడు. ఈ ఏడాది అధ్యక్ష పదవికి జరిగే ఎన్నికలలో డెమొక్రాటిక్ పార్టీ అభ్యర్థిగా పోటీ చేయడానికి ఇటీవలనే ఎన్నికైనారు.

దానితో ప్రధానమైన ఘట్టం ఒకటి ముగిసినది. ఇంక రిపబ్లికన్ పార్టీ అభ్యర్థితో తలపడి విజయం సాధించడమే తరువాయి.

అమెరికా కాంగ్రెసులో ఆధిక్యం ఈనాడు డెమొక్రాటిక్ పార్టీది. ప్రజలలో అయిదింట మూడువంతుల మంది ఆ పార్టీకే అనుకూలంగా ఉన్నారని నిపుణుల అభిప్రాయం.

కెన్నెడీ లక్ష్యం నెరవేరే అవకాశాలు అధికంగా ఉన్నట్లే గోచరిస్తున్నది.

బోస్టన్ నగరవాసి అయిన కెన్నెడీ కోటీశ్వరుని కుమారుడు. యువకుడు (43 సంవత్సరాల వయసు).

కెన్నెడీ రోమన్ కాథలిక్. అమెరికాలో అత్యధిక సంఖ్యాకులు ప్రొటెస్టెంట్లు. ఆ దేశ చరిత్రలో మున్నెన్నడూ రోమన్ కాథలిక్ అధ్యక్షుడుగా ఎన్నికై ఉండలేదు. రోమన్ కాథలిక్‌ను డెమొక్రాటిక్ పార్టీ తన అభ్యర్థిగా ఎన్నుకోవడమే ఇది రెండవపర్యాయం. 1928 లో డెమొక్రాట్ అభ్యర్థి అల్ స్మిత్ ఓడిపోయారు.

అయినా ఈ ప్రొటెస్టెంటు దేశం రోమన్ కాథలిక్‌ను అధ్యక్షుడుగా ఎన్నుకొంటుందో లేదో పరీక్షించటానికి ఇదొక అవకాశమని కెన్నెడీ అన్నారు.

ఏమైనా డెమొక్రాటిక్ పార్టీ అభ్యర్థి ఎన్నికలో మాత్రం ఈ మత భేదానికి అణుమాత్రమైనా ప్రాధాన్యం లేక పోయినది. కెన్నెడీ మొదటి బాలట్‌లోనే అత్యధిక సంఖ్యాకుల బలంతో ఎన్నికైనారు.

కెన్నెడీతో పోటీచేసిన సెనేట్ మెజారిటీ పార్టీ నాయకుడు లిండన్ బెయిన్స్ జాన్సన్ ఉపాధ్యక్ష పదవికి డెమొక్రాటిక్ పార్టీ అభ్యర్థిగా ఎన్నికైనారు.

కెన్నెడీకన్న జాన్సన్ వయసులో 51 (సంవత్సరాలు), అనుభవంలో పెద్ద. కెన్నెడీ లిబరల్ అయితే జాన్సన్ కన్సర్వేటివ్.

జాతిద్వేషపూరితులైన దక్షిణ రాష్ట్రాల వారికి కెన్నెడీ అయిష్టుడు. కాని జాన్సన్ టెక్సాస్ రాష్ట్రానికి ఏకైకనాయకుడు. కెన్నెడీ రోమన్ కాథలిక్ అయితే జాన్సన్ ప్రొటెస్టెంటు. ప్రధానమైన ఉభయవర్గాలకు ప్రాతినిధ్యం వహించే ప్రముఖులను ఉభయ పదవులకు అభ్యర్థులుగా ఎన్నుకోవడంతో డెమొక్రాటిక్ పార్టీ ఎన్నికలలో ఏకోన్ముఖంగా కృషి చేయగలదు.

రిపబ్లికన్ పార్టీ స్థితి సరిగా ఇందుకు భిన్నంగా ఉన్నది. ప్రస్తుత ఉపాధ్యక్షుడు రిచర్డ్ నిక్సన్ అధికసంఖ్యాకుల అభిమానం చూరగొన్నవాడు. నిక్సన్ కన్సర్వేటివ్. ఆయనతో పోటీకి దిగిన రాక్ ఫెల్లర్ లిబరల్.

నిక్సన్ అభ్యర్థిగా ఎన్నికైతే ఆ పార్టీ చీలుతుందని రాజనీతిజ్ఞుల అభిప్రాయం.

డెమొక్రాటిక్ పార్టీ అభ్యర్థి నియామకం విషయంలో పలువురు తొలుత ఊహించినట్లుగా వ్యవసాయదారుల సమస్య వంటి అంతరంగిక వ్యవహారాలకు ఏమంత ప్రాధాన్యం లభించలేదు. అన్నిటినీ మించి విదేశాంగ వ్యవహారాలకే విశేషమైన ప్రాధాన్యం లభించినది.

కాంగ్రెసు సభ్యత్వం సంపాదించిన నిమిషం నుంచీ కెన్నడీ విదేశాంగ వ్యవహారాలపట్ల అధికమైన ఆసక్తి చూపుతున్నాడు. అమెరికా వైదేశిక విధానానికి భిన్నమైన కొత్త మార్గం అనుసరించడానికి కృతనిశ్చయుడై ఉన్నాడు. అల్జీరియాకు స్వాతంత్ర్యం దత్తం చేయాలని ప్రకటించడం, చైనా తీర ప్రాంతపు దీవుల రక్షణకు అమెరికా కట్టుబడి ఉండరాదని వాదించడం కెన్నడీ వైఖరికి తార్కాణం.

మన దేశాభివృద్ధికి ఇతోధికమైన ఆర్థిక సహాయం అందజేయాలని కూడా కోరుతున్నాడు కెన్నెడీ. ★

న్నారు. ఉండివుండి, దీపపు వెలుగు శేషగిరి మీద పడుతూవుంటే శేషగిరి మొహం కప్పుకుంటూ పక్కకు తప్పుకుంటున్నాడు. "ఎక్కడికి?" అన్నాడు జట్కావాడు. శేషగిరి ఏదో వీధిపేరు చెప్పి - దారి చూపించసాగాడు. ఆ వీధి శేషగిరి వీధి కాదు—దాని వెనకవీధి. ఆ వీధిలోనికి గనక పోతే, దొడ్డి

## దిదృక్ష

గుమ్మాన తన ఇంట్లో ప్రవేశించ వచ్చును. ఆ వీధి సమీపిస్తున్న కొద్దీ శేషగిరికి కాళ్లూ చేతులూ వణకసాగినయ్. తన వీధి దాటి అవతలి వీధి చేరుకునేలోగా శేషగిరి తను ఎరిగున్న మనిషిని చూశాడు. వొట్టి చూడటం కాదు—పరీక్షగా చూశాడు—ఆ మనిషి ముఖంలో 'విషాదచ్ఛాయలు' ఉన్నాయేమోనని. ఉన్నట్టే కనిపించింది శేషగిరికి. తను చెప్పిన

(60-వ పేజీ చూడండి)

మీ సౌందర్యానికి తగినది
హిమాలయా బుకే
టాయ్‌లెట్ పౌడర్




సాటిన్-వంటి మెత్తని హిమాలయా బుకే టాయ్‌లెట్ పౌడర్ మిమ్ములను సువాసనతో హాయిగా వుంచును; మీరు అతి సౌందర్యంగా నుండునట్లు చేయును.

సర్వదా హిమాలయా బుకే టాయ్‌లెట్ పౌడర్ వాడండి.

2 సైజులలో లభించుచున్నది. మరియు అద్దుకొనే ప్యాడ్ సహితం లేక ప్యాడ్ లేకుండా

లండన్‌లోని ఇరాస్మిక్ తరఫున హిందుస్థాన్ లీవర్ లిమిటెడ్‌చేత భారతదేశంలో తయారు చేయబడినది.

HBP. 3-X52 TL

వీధి రానేవచ్చింది. బండి బాగా వీధిలోకి పోయాక, కొంచెం చీకటిగా వున్నచోట బండిని ఆపించి, నెమ్మదిగా దిగాడు. కాళ్లు వొణుకుతూ ఉండడంవల్ల సరిగా నిలబడలేక కొద్దిగా తూలాడు. అంతలోనే సర్దుకుని, డబ్బులుతీసి ధైర్యంగా జట్కావాడి చేతిలో పెట్టేశాడు.

జట్కా వెళ్ళిపోయింది. శేషగిరి అ

## దిదృక్ష

(12-వ పేజీ తరువాయి)

చీకట్లో కదిలి బయటకొచ్చాడు. అదంతపెద్ద వీధికాదు. సందు. ఎక్కడా మనుష్య సంచారం లేదు. తన దొడ్డిగుమ్మం కొన్నిగజాల దూరంలోనే ఉన్నది. అక్కడికి చేరుకోడానికి శేషగిరికి సప్తసముద్రాలూ దాటాల్సినంత ప్రయత్నం చేసి నెమ్మదిగా రెండడుగులు ముందుకువేసి చటుక్కున ఆగాడు. వెనకాల ఎవరో వస్తున్న శబ్దం వినిపించింది. శేషగిరి వెనక్కు తిరిగాడు—తన మిత్రుడొకడు! శేషగిరికి గుండె 'దడదడ' హెచ్చింది. తొందరగా చీకట్లోకొచ్చి తార


దేవిక, వి.వి.ఎస్. ప్రొడక్షన్స్‌వారి "నాగ నందిని చిత్రంలో తార"



వీనులకు విందైన మధుర సంగీతమా!

# మీరు సొగసుగానున్నారని వినగానే!

LUX TOILET SOAP

సినిమా తారలకు సౌందర్యము నిచ్చే శుద్ధమైన, సౌమ్యమగు సబ్బు

హిందుస్థాన్ లీవర్ ఉత్పత్తి

ఒక్క చూపు, ఒక్కటే మెప్పుమాట ... ఇవి స్వల్ప విషయాలే అయినా, అద్దంలోవలె మీ వశీకర తన్మయత్వం — అందమే అందంగా చాటుచున్నవి. మీరు సొగసుగా నున్నారనే ఆత్మవిశ్వాసం హెచ్చుచున్నకొలదీ మీ సౌందర్యం శుక్లపక్ష చంద్ర బింబమువోలె వృద్ధి పొందదా? చర్మము సొగసుగా లేక పోతే సంపూర్ణ సౌందర్యం కలుగదని సినిమా తార దేవిక ఎరుగును, ఆమె ఇలా చెప్పుచున్నది. "అందుకే నాకు పరిమళమైన లక్స్ టాయిలెట్ సబ్బుయందు నమ్మకం, దాని సౌమ్యమైన మీగడవంటి నురగ నా చర్మమును మృదువుగాను సొగసుగాను వుండునట్లు చేయుచున్నది." మీరు కూడా అత్యంత సౌందర్యంగా వుండండి ... లక్స్ వాడుట వల్ల!

LTS. 44-X52 TT.

ట్టాడసాగాడు. దొంగలాగ నక్కుతూన్న శేషగిరిని చూసి—"ఎవరది?" అని గద్దించాడు ఆ మిత్రుడు. శేషగిరి ప్రాణాలు పైనే ఎగిరిపోయినయ్. అయినా ఆ వెంటనే నిలద్రొక్కుకుని, గొంతు మార్చి, ధాటీగా— "ఈ యింటి నౌకరోడిని బాబూ!"—అన్నాడు.

ఆ మిత్రుడు 'ఓ' అని తన దారిన వెళ్ళిపోయాడు. ఈలవాట పాడుకుంటూ, 'అమ్మయ్యా' అనుకున్నాడు శేషగిరి. తను మహానటుడు! కాని అంతలోనే శేషగిరికి ఓ అనుమానం కలిగింది. తను చనిపోయిన వార్త వీడు వినలేదా? వింటే, ఇట్లా ఈలపాట పాడతాడా? ఒకవేళ వినలేదేమో! విన కుండా వుండటానికి అవకాశంలేదు. ఆ వైరు చాలా సేపటినుండే చేరి వుంటుంది. కొంపదీసి ఆ వైరు చేరలేదేమో అనే సందేహం కూడా కలిగింది. చేరక ఏమవుతుంది? అసలు తనకొంప జేరితేనేకాని అన్ని విషయాలూ పూర్తిగా బయటపడవు.

ప్రాణాలు బిగబట్టుకుని వూపిరి స్తంభించుకుని నెమ్మదిగా అడుగులువేస్తూ శేషగిరి తన ఇంటి దొడ్డిగుమ్మం చేరుకున్నాడు. దొడ్డిగుమ్మం ఏమంత ఎత్తయినదికాదు. తట్టి చూశాడు—మూసివుంది. ఏమయినా ఏడుపులు వినిపిస్తున్నాయేమోనని తలుపుమీద చెవిపెట్టి విన్నాడు. ఎక్కడా ఏమీ వినిపించ లేదు. దానికి ఒక కారణం వుండొచ్చు. దొడ్డిగుమ్మంనుంచి ఇంట్లోకి కొద్దిగా దూరం వుంది. ఇక్కడినుంచి కేకవేసినా కూడా అందనంతదూరం!

అటూ ఇటూ చూసి శేషగిరి గోడ ఎగ బ్రాకి, చప్పుడు చెయ్యకుండా అవతలకు దిగాడు. అంతా చీకటిగావుంది. దొడ్డి నిండా గడ్డి పెరగటంవల్ల దోవకూడా సరిగా తెలియటంలేదు. అలవాటయిన ప్రదేశమే కాబట్టి తడుముకుంటూ దొడ్డిదాటి బావి దగ్గరకు చేరుకున్నాడు. బావి ముందున్న తలుపులు కూడా మూసివున్నై. శేషగిరి నెమ్మదిగా తలుపు సందులోంచి చూశాడు. గుడ్డిగా దీపం వెలుగు కనిపించింది. ఆ వెలుగులోనే దూరంగా మసకమసకగా ఎవరో పడివున్నట్టు కూడా కనిపించింది. ఆ పడివున్నది తన భార్యేనని తెలుసుకోగల్గాడు శేషగిరి. ఎవరో ఏడుస్తున్నట్టు కూడా వినిపించింది. అమ్మయ్యా! తన వైరు అందింది! కాని— గోలుగోలున ఏడుపు వినిపించటంలేదేం—

అంతలోనే శేషగిరి పెద్దగా ఏడుపు విన్నాడు. అది తన తల్లిది! ఎవరో ఇంటికి రాగా వాళ్ళను చూచి ఆమె బావురుమన్నట్టుంది. "ఎంతపని చేశావురా నాయనా, ఎంతపని చేశావురా! ఇంతలోనే నీకు నూరేళ్లూ నిండిపోయాయా? నా తండ్రీ! నీ శవాన్ని కూడా చూసే దిక్కులేక పోయిందిరా" అని ఆమె ఏడుస్తున్నది. "పూరుకోండమ్మా ఏంజేస్తాం" అంటున్నారెవరో. తన భార్య ప్రక్కను ఎవరో కూచుని లేవదీస్తున్నారు. ఆమె లేచి కూచుంది. అంతలోనే ఒక్కసారి కూలబడి భోరున ఏడ్చింది. పిల్లలంతా 'అమ్మా అమ్మా' అని దగ్గర కొస్తూ చుట్టుముట్టారు. ఒకబ్బాయి 'నాన్న నాన్న' అంటూ ఏడుస్తున్నాడు.

"నాన్నగారు వస్తారమ్మా!" అన్నారు ఎవరో.

"నాన్న! బాబూ! నాన్న ఇంకరారమ్మా నాన్న ఇంకరారు!" అని శేషగిరి భార్య తల బాదుకుని ఏడుస్తున్నది...ఎవరెవరో వస్తున్నారు...మాటలు వినిపిస్తున్నై...

తన మరణవార్త అందరికీ తెలిసినట్టు రూఢి చేసుకున్నాడు శేషగిరి. అంతా వింటూ ఆనందపడసాగాడు. వచ్చినవాళ్ళల్లో కొందరు వెళ్తున్నారు...కొందరు వస్తున్నారు. తననుగురించే అందరూ మాట్లాడుకుంటున్నారు. ఆ మాట లేమిటో సరిగ్గా తెలియకపోయినా ఎవరెవరు రావాలని తను అనుకున్నాడో ఆ స్నేహితులంతా వస్తున్నారు. మధ్యలో భార్య శోష వచ్చి పడిపోయింది. శేషగిరికి దుఃఖం కలిగింది. తన భార్యను ఇంకా ఏడిపించటం తగదనుకున్నాడు. తను చచ్చిపోతే అంతా ఈవిధంగా దుఃఖిస్తారని తేలిపోయింది! తనను గురించి అంతా చక్కగానే మాట్లాడుకుంటారన్న మాట! ఈ వ్యవహారాన్ని ఇంక పొడిగించరాదని తీర్మానించుకున్నాడు శేషగిరి. ఇంక ఆట్టే ఆలస్యం చెయ్యకుండా వాళ్ళముందు పడాలి. లేకపోతే ఇట్లా తను చనిపోయినట్టు తన మామగారికీ, దూరపు బంధువులకూ తెలియజేస్తారు. తను ఆడిన నాటకం బాగా రక్తికట్టింది! తను ఇంక తలపాగా లాగి పారేసి, పైన తొడుక్కున్న వేషం తీసేసి—దేవుడు పంపినట్టు ఛటుక్కున ఇంట్లో ప్రత్యక్షం కావాలి! శేషగిరి కిందనున్న చేతి సంచీ చేతిలోకి తీసుకుని, ఇంట్లోకి రావటానికని మళ్ళీ దొడ్డిగుమ్మం దాటాలని లేచాడు.

* * *

ఇంట్లో రోదన ధ్వనులు ఎక్కువయినై. శేషగిరి భార్య ఎంతమంది వూరుకోమంటున్నా వినకుండా పిల్లవాళ్ళను పట్టుకుని, నెత్తినోరూ బాదుకుని ఏడుస్తున్నది. ఈ ఏడుపుల శబ్దాన్ని చీల్చుకుంటూ భయంకరమైన ఆర్తనాదం ఒకటి వినిపించింది వాళ్ళకు. అందరూ ఆశ్చర్యంగా పరుగెత్తి దొడ్డి తలుపులు తెరచి చూశారు. ఆ కేక వేసినవాడు శేషగిరి! చీకట్లో క్రింద బోర్లా పడివున్నాడు. చేతిలో వుండాల్సిన సంచీ పట్టుతప్పి ఎక్కడో పడిపోయివున్నది. శేషగిరి స్నేహితుడొకడు దీపం తీసుకొచ్చి చూశాడు. శేషగిరి నోట్లోంచి తెల్లగా నురగలు వస్తున్నై!...అందరూ దిష్టి బొమ్మల్లే చూస్తూ వుండగా శేషగిరి కాళ్ళకు చుట్టుకునివున్న ఒక పెద్ద సర్పం బుసలు కొడుతూ నెమ్మదిగా బయటకు వచ్చి, తొందరగా ఆ చీకట్లోంచి ప్రాకి పొదల్లోకి దూరిపోయింది! ★


వెలువడింది! రసవంతమైె ప్రదర్శనాయోగ్యమైన ఒకే పుస్తకంలో రెండు నాటికలు!!

**1. డిటెక్టివ్ 2. న్యాయమందిరం**

రచన : అంబటి వెల 1 రూపాయి

ఏజంట్లు కాపీలకు 40% కమీషను మినహాయించుకొని డబ్బు పంపండి. పోస్టేజి అదనం.

ప్రేమ్‌కుమార్ పబ్లికేషన్స్,
సామర్లకోట. తూ.గో.జిల్లా.

**విజ్ఞానానికి మన ప్రశ్నలు**

రచన : బులుసు వేంకట సుబ్బారావు, M.A.
భారత ప్రభుత్వ బహుమానమునంది,
డా॥ S. రాధాకృష్ణన్ మున్నగువారిచే
ప్రశంసింపబడిన ఉత్తమగ్రంథం. వెల 1-50.

B. V. S. Rao: B. V & Sons.
Ramaraopet, Kakinada.

**RATNAM'SN-OIL**

అంగనరములు బలహీనతి చెంది, చిన్నదినచో తిరిగి యథాప్రకారం అయి పూర్తి సౌఖ్య మనుభవించుటకు 50 సం॥ ప్రఖ్యాతి గలది. 1 సీసా రూ. 10 లు వి. పి. 1-4-0 కావలసినవారు ముందుగా 1-4-0 పంపేది. ఇందులో స్పెషల్ రకం అర్జంటుగుణమునకు రూ. 25-0-0 లు.

డాక్టర్. రత్నం సన్స్, (Estd 1904)
మలక్‌పేటబిల్డింగ్స్, అజంపూరామార్కెట్ వద్ద, హైదరాబాద్ 24 A. P.

